# వరంగల్ వాయిస్

Evening Daily

సంపుటి : 04 | సంచిక : 149
పేజీలు : 08 | వెల: రూ.5/-

శుక్రవారం
మార్చి 07, 2025

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net



## వరంగల్ సీపీగా సన్ ప్రీత్ సింగ్





2లో..

- ఈస్ట్ జోన్ డీసీపీ గా అంకిత్ కుమార్..
- రాష్ట్రంలో 21 మంది ఐపీఎస్ ల బదిలీ




వివరాలు 2లో..

# ఎమ్మెల్సీ ఆశలు











- టికెట్ రేసులో పలువురు ప్రముఖులు
- లాబీయింగ్ చేస్తున్న నేతలు
- ఆదివారం ఢిల్లీకి సీఎం, పార్టీ ముఖ్యులు
- 5 ఎమ్మెల్సీ స్థానాలకు 20న పోలింగ్
- సోమవారంతో ముగియనున్న నామినేషన్ల ప్రక్రియ

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ సీట్లపై ఆశలు పెట్టుకున్నారు. మార్చి 29వ తేదీ నాటికి శాసన మండలిలో ఐదు స్థానాలు ఖాళీ కానున్న నేపథ్యంలో ఈ స్థానాలకు ఎలాగైనా కైవసం చేసుకోవాలన్న పట్టుదలతో పోటాపోటీగా లాబీయింగ్ చేస్తున్నారు. అయితే మొత్తం ఐదు సీట్లలో అధికార కాంగ్రెస్ పార్టీ నాలుగు స్థానాల్లో గెలిచే అవకాశం ఉంది. దీంతో అధికార పార్టీలో ఆశావహుల తాకిడీ ఎక్కువైంది. టిక్కెట్ కోసం ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. ఎమ్మెల్సీ రేసులో జీవన్ రెడ్డి, జగ్గారెడ్డి, వేం నరేందర్ రెడ్డి, సామ రామ్మోహన్ రెడ్డి, జట్టి కుసుమ కుమార్, కుమార్ రావు, హర్కార వేణు గోపాల్ రావు, అంజన్ కుమార్ యాదవ్, చరణ్ కౌశిక్, సునీతా రావు, సరితా యాదవ్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. వీరంతా పార్టీ అధిష్ఠానాన్ని ప్రసన్నం చేసుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే సోమవారంతో నామినేషన్ ప్రక్రియ ముగియనున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ కసరత్తును ముమ్మరం చేసింది. ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితోపాటు పార్టీ ముఖ్యులు ఢిల్లీ అధిష్ఠానంతో చర్చలు జరిపి లిస్ట్ ఫైనల్ చేయనున్నారు.

- వరంగల్ వాయిస్ ప్రతినిధి




పాఠకులకు, ప్రకటనకర్తలకు ప్రతి ఒక్కరికీ..

## అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు..

ఇట్లు : వరంగల్ వాయిస్, మేనేజ్ మెంట్
చిత్రకారుడు : ఆమంచ రవి, సర్వేయర్, ఉర్సు




2లో..

## సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలి

- విభిన్న రంగాల్లో రాణిస్తున్న మహిళలు
- వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వీబీ.నిర్మల గీతాంబ



2లో..

## తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలి

- నగర మేయర్ గుండు సుధారాణి
- కమిషనర్ తో కలిసి ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష

# ఎమ్మెల్సీ ఆశలు



- టికెట్ రేసులో పలువురు ప్రముఖులు
- లాబీయింగ్ చేస్తున్న నేతలు
- ఆదివారం ఢిల్లీకి సీఎం, పార్టీ ముఖ్యులు
- 5 ఎమ్మెల్సీ స్థానాలకు 20న పోలింగ్
- సోమవారంతో ముగియనున్న నామినేషన్ల ప్రక్రియ

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** ప్రస్తుతం రాష్ట్రంలో ఎమ్మెల్యే కోటాలో ఐదు ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. మార్చి 29వ తేదీ నాటికి శాసన మండలిలో ఐదు స్థానాలు ఖాళీ కాబోతున్నాయి. ఈ స్థానాలు భర్తీ చేసేందుకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. మార్చి 20వ తేదీన పోలింగ్ జరుగనుంది. దీంతో ప్రధాన పార్టీల్లోని ఆశావహులు ఎమ్మెల్సీ సీటు దక్కించుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ముఖ్యంగా అధికార కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ సీటు పొందేందుకు రాష్ట్ర స్థాయి నుంచి ఢిల్లీ స్థాయి వరకు లాబీయింగ్‌లు చేస్తున్నారు. ఈ ఐదు సీట్లలో కాంగ్రెస్ నాలుగు ఎమ్మెల్సీలు గెలిచే అవకాశం ఉండటంతో ఆ పార్టీలో ఆశావహుల తాకిడీ ఎక్కువైంది. టిక్కెట్ కోసం ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు.

### ఎమ్మెల్సీ రేసులో సీనియర్లు..

ఎమ్మెల్సీ రేసులో జీవన్ రెడ్డి, జగ్గారెడ్డి, వేం నరేందర్ రెడ్డి, సామ రామ్మోహన్ రెడ్డి, జట్టి కుసుమ కుమార్, కుమార్ రావు, హర్కార వేణు గోపాల్ రావు, అంజన్ కుమార్ యాదవ్, అద్దంకి దయాకర్, జ్ఞాన సుందర్, దొమ్మటి సాంబయ్య, రాచమల్ల సిద్ధేశ్వర్, చరణ్ కౌశిక్, సునీతా రావు, పారిజాత నరసింహ రెడ్డి, సరితా యాదవ్, ఇరవత్రి అనిల్, కొనగాల మహేష్, జెర్బేటి జైపాల్, గాలి అనిల్, బెల్లయ్య నాయక్ బానోతు విజయాభాయి, రేఖా నాయక్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. వీరంతా పార్టీ అధిష్టానాన్ని ప్రసన్నం చేసుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. వారి ప్రయత్నాలు ఎలా ఉన్నా.. ఎమ్మెల్యే కోటాలో టీపీసీసీ మీడియా కమిటీ చైర్మన్ సామా రామ్మోహన్ రెడ్డికి ఎమ్మెల్సీ కన్ఫామ్ అయినట్లు ప్రచారం సాగుతోంది. సామాన్య కార్యకర్త స్థాయి నుంచి టీపీసీసీ మీడియా కమిటీ చైర్మన్‌గా, పార్టీ అధికార ప్రతినిధిగా రామ్మోహన్ రెడ్డి ఎదిగారు. అడ్వకేట్‌గా, మీడియా స్పోక్స్‌పర్సన్‌గా కాంగ్రెస్ పార్టీకి ఎన్నో విధాలుగా సేవలు అందిస్తున్నారు.

### పార్టీలో ఉత్కంఠ..

తెలంగాణలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక విషయంలో ఉత్కంఠ నెలకొంది. ఈ క్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర ఇంచార్జి మీనాక్షి నటరాజన్, సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి ఉత్తమ్, పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్.. ఆదివారం ఢిల్లీకి వెళ్లనున్నారు. ఈ సందర్భంగా ఏఐసీసీ పెద్దలతో తెలంగాణ కాంగ్రెస్ నేతల భేటీ కానున్నారు. కాంగ్రెస్ నేతల భేటీ సందర్భంగా మంత్రి వర్గ విస్తరణ, పార్టీలో కీలక పదవులు కూడా ఖరారు చేసే అవకాశం ఉంది. అన్ని పదవులు భర్తీ చేసి భవిష్యత్ కార్యాచరణపై దృష్టి పెట్టాలని కాంగ్రెస్ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది.

### ఈ నెల 10 చివరి తేదీ..

ఇదిలా ఉండగా.. తెలంగాణ ఎమ్మెల్సీల నామినేషన్లు దాఖలుకు ఈ నెల 10 చివరి తేదీ కావడంతో కాంగ్రెస్ ఇంచార్జి మీనాక్షి నటరాజన్ ఇప్పటికీ వడపోత ప్రక్రియ ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ ఫైవ్ మెన్ కమిటీ ఇచ్చిన పేర్లను వడబోస్తున్నారు. అయితే పలువురి పేర్లను వారు ఖరారు చేసినట్టు ప్రచారం సాగుతోంది. మార్చి 11న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. 13వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పించారు. మార్చి 20న ఉదయం 9 గంటల నుంచి సాయంత్ర 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. అదే రోజు సాయంత్రం 5 గంటల నుంచి ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

# సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ముందు తరాలతో పోల్చుకుంటే ప్రస్తుత తరంలో మహిళలు విభిన్న రంగాల్లో ముందు వరుసలో నిలుస్తున్నారని వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వీబీ.నిర్మల గీతాంబ అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ హనుమకొండ, వరంగల్ జిల్లా శాఖల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వీబీ. నిర్మల గీతాంబ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ముందు నిలుస్తున్నారన్నారు. కలెక్టర్లు, పోలీస్, తదితర ఉద్యోగాలు మొదలుకొని ఆకాశం వరకు మహిళలు ఎన్నో అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నతిని పొందుతున్నారన్నారు. మహిళలు ఉద్యోగాలు, బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారన్నారు. సమస్యలు ఎదురైనప్పుడు మహిళలు ధైర్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగంలో విధులు నిర్వర్తిస్తున్న ప్రతి మహిళా ఒక రోల్ మోడల్ అని పేర్కొన్నారు. సమాజంలో పురుషులే మహిళా దినోత్సవం నిర్వహించినప్పుడే అసలైన మహిళా దినోత్సవం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, టీఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగన్ మోహన్ రావు, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మేన శ్రీను, జిల్లా ఖజానా శాఖ అధికారి శ్రీనివాస్ కుమార్, మహిళా అధికారులు నీరజ, అనురాధ, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

# జూట్ బ్యాగులపై అవేర్ నెస్



**పాల్గొన్న వరంగల్ కలెక్టర్ సత్య శారద**

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** నేషనల్ జూట్ బోర్డ్, కేంద్ర టెక్స్టైల్ శాఖ వారి సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం వరంగల్ రైల్వే స్టేషన్ సమీపంలోని హోటల్ ఎంకే నాయుడులో జూట్ మార్క్ ఇండియా స్కీమ్ పై అవేర్నెస్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ కలెక్టర్ సత్య శారద, అతిథులుగా వరంగల్ డీఆర్డీఏ ప్రాజెక్ట్ మేనేజర్ కౌసల్య, హాండీ క్రాఫ్ట్ అసిస్టెంట్ డైరెక్టర్ విచ్చేసి జూట్ ఉత్పత్తులను పరిశీలించారు. జూట్ బ్యాగులతో కలిగే ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. తదనంతరం ఆన్లైన్ మార్కెటింగ్ పై వారితో చర్చించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు నేత, దోమల నాగేందర్, గుత్తికొండ తిరుపతి, ఆడెపు రవి, బాసాని కరుణాకర్, కూచన లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ సీపీగా సన్ ప్రీత్ సింగ్

- రాష్ట్రంలో 21మంది ఐపీఎస్ ల బదిలీ

**వరంగల్ వాయిస్, క్రైం :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ నూతన కమిషనర్ గా సన్ ప్రీత్ సింగ్ ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారిచేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 21మంది ఐపీఎస్ లను ప్రభుత్వం బదిలీ చేసింది. ప్రస్తుతం సూర్యాపేట జిల్లా ఎస్పీగా విధులు నిర్వహిస్తున్న సన్ ప్రీత్ సింగ్ 2011ఐపీఎస్ బ్యాచ్ కు చెందినవాడు. 2012 సంవత్సరంలో ములుగు ఏఎస్పీ, వరంగల్ రూరల్ ఓఎస్ డీగా ఆయన పని చేశారు. అనంతరం ఎల్ బీ నగర్ డీసీపీగా, జగిత్యాల్ ఎస్పీగా పనిచేశారు. ప్రస్తుతం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా రామగుండం పోలీస్ కమిషనర్ బదిలీ అయినారు.

### ఈస్ట్ జోన్ నూతన డీసీపీ గా అంకిత్ కుమార్..

వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఈస్ట్ జోన్ డీసీపీగా అంకిత్ కుమార్ ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అంకిత్ కుమార్ గతంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ లో ట్రైనీ ఐపీఎస్ గా పని చేశారు.



# కల్తీ, కాలం చెల్లిన కూల్ డ్రింక్స్ విక్రయం

- టాస్క్‌ఫోర్స్ దాడుల్లో బట్టబయలు
- రూ.77,935 వేల విలువైన డ్రింక్స్ స్వాధీనం

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** వరంగల్ కరీమాబాదులోని సాయిబాబా కూల్ డ్రింక్స్ డిస్ట్రిబ్యూటర్ విక్రయానికి సిద్ధంగా ఉంచిన కల్తీ, కాలం చెల్లిన కూల్ డ్రింక్స్ లను శుక్రవారం టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించి స్వాధీనం చేసుకున్నారు. 21 రకాలకు చెందిన ఈ కూల్ డ్రింక్స్ విలువ సుమారు రూ.77,935 ఉంటుంది. వరంగల్ మహా నగరంలో ఫుడ్ సేఫ్టీ విషయంలో నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలు పాటించకుండా ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న వ్యాపారస్తుల పట్ల కఠినంగా వ్యవహరించాలనే గట్టి నిర్ణయంతో వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ ఆధ్వర్యంలో కరీమాబాద్ లో దాడులు నిర్వహించారు. టాస్క్ ఫోర్స్ ఇన్ స్పెక్టర్ ఎం.రంజిత్ కుమార్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు సంయుక్తంగా నిర్వహించిన దాడుల్లో కాలం చెల్లిన కూల్ డ్రింక్స్ బయటపడ్డాయి. దీంతో సాయిబాబా కూల్ డ్రింక్స్ డిస్ట్రిబ్యూషన్ షాపు నడుపుతున్న కొత్తిమీర కారు శైలజ అదుపులోకి తీసుకొని విచారణ నిమిత్తం మిల్స్ కాలనీ పోలీసులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వడ్డే దిలీప్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ కృష్ణమూర్తి, టాస్క్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

# తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలి

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. శుక్రవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకాడేతో కలిసి ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 66 డివిజన్లో మంచినీటి సక్రమ నిర్వహణకు రూపొందించిన అన్యువల్ మెయింటెనెన్స్, సమ్మర్ యాక్షన్ ప్లాన్ ప్రతిపాదనలను డివిజన్ల వారీగా మేయర్, కమిషనర్ లు సమీక్షించి సమర్థ నిర్వహణకు పలు సూచనలు చేస్తూ వెంటనే టెండర్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వేసవి కాలంలో బల్దియా పరిధిలోని దాదాపు పది లక్షల జనాభాకు ధర్మసాగర్ సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నుంచి ఫిల్టర్ బెడ్ ల ద్వారా తాగు నీరు అందించనున్నట్లు పేర్కొన్నారు. వచ్చే మూడు మాసాలకు సరిపడ నీరు అందుబాటులో ఉందన్నారు. అవసరమైతే జిల్లా కలెక్టర్ ద్వారా ఇరిగేషన్ అధికారులకు లేఖ రాయాలన్నారు. మహా నగరంలోని దేశాయిపేట, కాకతీయ యూనివర్సిటీ, వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్లలో ఉన్న మరమ్మత్తులను అత్యవసర ప్రాతిపదికన చేపట్టాలన్నారు. అదేవిధంగా అవసరమైన రసాయనాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. స్లమ్ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఉన్న బోర్లను ఫ్లషింగ్ చేయడంతో పాటు నీటి సమస్య ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా సరఫరా జరిగేలా ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ముఖ్యమైన కూడళ్లు, జనావాస ప్రదేశాల్లో తక్షణమే చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమీక్షలో బల్దియా ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, ఈఈలు మహేందర్, రవికుమార్, సంతోష్ బాబు, మాధవి లత, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

# మహిళా లోకానికి స్ఫూర్తి.. డాక్టర్ కల్లేపల్లి అక్షిత


- మహిళా సాధికారతకై ఉక్కు సంకల్పం
- ఉచిత బ్యూటిషియన్, టైలరింగ్ శిక్షణ



**వరంగల్ వాయిస్, సిరిసిల్ల :** మహిళలు వంటింటికే పరిమితం కాకూడదని భావించారు ఓ వైద్యురాలు.. స్త్రీలు వారి కాళ్లపై వారే నిలబడాలనే గట్టి సంకల్పాన్ని తీసుకున్నారు. ఈ క్రమంలోనే 4000 నుంచి 5000 మంది మహిళలకు ఉచిత బ్యూటిషియన్ శిక్షణ ఇప్పించారు. అంతేకాకుండా మగ్గం, టైలరింగ్ లో శిక్షణ ఇప్పించి వారు స్వయం సాధికారత సాధించే దిశగా అడుగు వేయించారు. మహిళలు పురుషులతో సమానంగా పోటీ పడగలిగితేనే వారికి మరింత గౌరవం లభిస్తుందని భావించి వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు డాక్టర్ కల్లెపల్లి అక్షిత ఉక్కు సంకల్పంతో ముందుకు సాగుతోంది.

## అమెరికా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్..

డాక్టర్ కల్లేపల్లి అక్షిత రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన వ్యక్తి. గత కొన్ని సంవత్సరాలుగా నాడీ వైద్యరంగంలో సేవలందిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం నుండి మొట్టమొదటి నాడీ తెరపిస్టుగా వెస్టన్ అమెరికా యూనివర్సిటీ నుంచి పద్మశాలి ముద్దుబిడ్డ కల్లేపల్లి అక్షిత ఆయుర్వేద డాక్టర్ గా డాక్టరేట్ అందుకున్నారు. కల్లేపల్లి అక్షిత నాడీ వైద్య రంగంలో చేస్తున్న సేవలను గుర్తించి గౌరవప్రదమైన డాక్టరేట్ అవార్డును అందజేసి గౌరవంగా సత్కరించారు. ఆమె సేవలకు గాను ఆరు డాక్టరేట్లు, ధనవంతరి నాడీ వైద్యంలో వైద్య విభూషణ్ అవార్డు , ఏపీజే అబ్దుల్ కలాం అవార్డు, స్వర్ణ నంది అవార్డు, లెజెండ్ అవార్డు, విశ్వవిఖ్యాత, మయూరి అవార్డు, నాట్యమయూరి అవార్డు, సంగీతంలో స్వర్ణ నంది అవార్డులు ఆమె అందుకున్నారు.







# కష్టపడ్డ వారికి నామినేటెడ్ పదవి ఇవ్వాలి

## పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ ను కలిసి వినతి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** కాంగ్రెస్ పార్టీ అధికారం ఉన్న లేకున్నా కాంగ్రెస్ పార్టీ కోసం 25 సంవత్సరాలు కష్టపడిన వారిని గుర్తించి నామినేటెడ్ పదవి ఇవ్వాలని పీసీసీ అధ్యక్షుడు బొమ్మగాని మహేష్ కుమార్ గౌడ్ ను వారి నివాసంలో శుక్రవారం 14వ డివిజన్ ఏనుమాముల ఎన్టీఆర్ నగర్ గ్రామానికి చెందిన మాజీ సోషల్ మీడియా రాష్ట్ర కోఆర్డినేటర్ అడుప మహేష్ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ మాట్లాడుతూ కష్టపడిన వారికి తగిన ప్రాధాన్యత గుర్తింపు ఉంటుందని తెలిపినట్లు మహేష్ పేర్కొన్నారు. గత 25 సంవత్సరాలుగా తాను చేసిన సేవ కార్యక్రమాలను అందించడం జరిగిందన్నారు. కష్టపడ్డ కార్యకర్తగా గుర్తించి రాష్ట్రస్థాయి నామినేట్ పదవి ఇవ్వగలరని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు సౌరం చిన్ని, సీనియర్ నాయకులు సౌరం ప్రభాకర్, సౌరం అభిలాష్, కోగిల సుధాకర్, యూత్ నాయకులు తోట రాకేష్ పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ పదవులను బీసీలకే కేటాయించాలి

## కాంగ్రెస్ ఇద్దరికి, బీఆర్ఎస్ ఒక్కరికి ఇవ్వాలి

## బీసీ నేత వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** త్వరలో ఎమ్మెల్యే కోటాలో జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వచ్చే మూడు ఎమ్మెల్సీ పదవుల్లో రెండు ఎమ్మెల్సీ పదవులను బీసీలకు కేటాయించాలని, బీఆర్ఎస్ పార్టీకి వచ్చే ఒక్క ఎమ్మెల్సీ స్థానాన్ని బీసీలకు కేటాయించి బీసీలపై కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ఉన్న చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ డిమాండ్ చేశారు. జనాభాలో సగభాగానికి పైగా ఉన్న బీసీలను అన్ని పార్టీలు కేవలం ఓటు బ్యాంక్ గా వాడుకుంటూ పదవులు మాత్రం అగ్ర వర్ణాల వారికే కేటాయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు బీసీలలో చాలా చైతన్యం వచ్చిందని రాష్ట్రంలో బీసీ వాదం బలపడుతుందని, 2028లో రాష్టంలో బీసీ ముఖ్యమంత్రి అయ్యేలా బీసీలంతా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

# తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు

## ▪ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మిషన్ భగీరథ, ఆర్ డబ్ల్యూఎస్ అధికారులతో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న వేసవి కాలం దృష్టిలో ఉంచుకొని నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో అధికారులు పర్యటించి నీటి సదుపాయం కల్పించేందుకు కృషి చేయాలని, అలాగే ఓవర్‌హెడ్ ట్యాంకులను క్లీనింగ్ చేయడం, నీటి శుద్ధి నాణ్యత పరీక్షలను క్రమం తప్పకుండా నిర్వర్తించాలన్నారు. వేసవిలో నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్న ప్రాంతాలను ముందే గుర్తించి, అక్కడ నీటి సరఫరాను పర్యవేక్షించాలని, మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా చేయాలని అన్నారు. వేసవిలో తాగునీటి సరఫరాలో అంతరాయం, సమస్యలు తలెత్తకూడదని అధికారులను ఆదేశించారు. తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి, అనుమతులు పొందుతూ పూర్తిస్థాయిలో మరమ్మతులు నిర్వహించాలన్నారు.

# పద్మశాలి కుల గ్రామ కమిటీ ఎన్నిక



**వరంగల్ వాయిస్, శాయంపేట :** గ్రామ పద్మశాలి కుల కమిటీని శుక్రవారం చేనేత సహకార సంఘంలో పద్మశాలి కుల బాంధవులందరి సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. కమిటీ అధ్యక్షుడిగా బాసని ప్రకాష్, ఉపాధ్యక్షులుగా మామిడి మారుతి, తుమ్మ ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా మంత్రి రమేష్ బాబు, సహాయ కార్యదర్శులుగా బాసని నవీన్, బత్తుల రాజేష్, కోశాధికారిగా గొట్టిముక్కల రమేష్, సభ్యులుగా కడారి చంద్రమౌళి, బత్తుల శ్రీధర్, మార్త రాజు, కందగట్ల గోపాల్, పసునూటి తిరుపతి, దిండిగాల రమేష్, చల్లా శ్రీనివాస్, బాసని శ్రీనివాస్, దుబాసి రవి ఎన్నికయ్యారు.

# డీజేలు పెడితే చర్యలు తప్పవు

## మట్టెవాడ సీఐ తుమ్మ గోపి



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఉత్తర్వుల మేరకు పట్టణంలో డీజేలు నిర్వహించడాన్ని నిషేధించడం జరిగిందని, ఈ విషయాన్ని పట్టణ ప్రజలు గమనించాలని, ఈ ఉత్తర్వులను ఉల్లంఘిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మట్టెవాడ సీఐ తుమ్మ గోపి హెచ్చరించారు. నిన్న రాత్రి 9 గంటల ప్రాంతంలో బొమ్మల గుడి సమీపంలోని వేణు రావు కాలనీలో ఎంబడి రాహుల్ తండ్రి పేరు బోజరాజు మనుగొండ గ్రామస్తుడు డబుల్ డీజే నడుపుతూ అధికారుల ఉత్తర్వులను ఉల్లంఘించి అక్కడి ప్రాంత వాసులను భయభ్రాంతులకు గురి చేశారు. ఈ విషయంలో ఎంబడి రాహుల్ పైన మట్టెవాడ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేశారు. అలాగే ఇకనుంచి ఎవరైనా డీజేని నడిపి ప్రజల శాంతికి భంగం కలిగించే విధంగా ప్రవర్తిస్తే వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అలాగే సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, వరంగల్ ఏసీబీ నందిరాం నాయక్ ఆదేశాల మేరకు ఇంటర్మీడియట్, పదవ తరగతి పరీక్షలు జరుగుతున్న సందర్భంగా మట్టెవాడ పోలీస్ స్టేషన్ పరిధిలో డీజేలు నిర్వహించి ప్రజలకు విద్యార్థిని విద్యార్థులకు ఇబ్బంది కలిగించినచో వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోబడుతుందని మట్టెవాడ సీఐ తుమ్మ గోపి తెలిపారు.

# డాక్టర్ బి.ప్రమీలా దేవికి సన్మానం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం అయూష్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ వరంగల్. డాక్టర్ బి.ప్రమీలా దేవికి, నేషనల్ మెడికల్ అసోసియేషన్ వరంగల్ తరపున సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. నేషనల్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ గుండా రవీందర్, ఉపాధ్యక్షుడు డాక్టర్ బి దుర్గాప్రసాద్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ మైదం రాజులు ప్రమీలా దేవిని సన్మానించిన వారిలో ఉన్నారు.

## ఓంకార్, బీఎన్ రెడ్డి పేర్లను వాడితే చర్యలు తప్పవు



● ఎంసీపీఐ(యూ) నేత వల్లెపు ఉపేందర్ రెడ్డి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బహిష్కృతులైన వ్యక్తులు క్రామేడ్ ఓంకార్, బీఎన్ రెడ్డి పేర్లను వాడితే చర్యలు తప్పవని ఎంసీపీఐ(యూ) నేత వల్లెపు ఉపేందర్ రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఎంసీపీఐ(యూ) హనుమకొండ జిల్లా కమిటీ సమావేశం కూతురు ఇంద్రా రెడ్డి అధ్యక్షతన ఓంకార్ భవన్ అండర్ బ్రిడ్జి వద్ద నిర్వహించడం జరిగింది. అమరజీవి, అసెంబ్లీ టైగర్, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు తాడిత పీడిత ప్రజల పక్షపాతి కామ్రేడ్ మద్ది కాయల ఓంకార్ స్థాపించిన పార్టీ నుంచి బహిష్కృతులైన వ్యక్తులు తమ బ్రతుకు దెరువు కోసం కామ్రేడ్ ఓంకార్, భీమిరెడ్డి నరసింహారెడ్డి పేర్లను వాడుతూ ఎంసీపీఐ పేరుతో చరిత్రను వక్రీకరించి అప్రతిష్ట పాలు చేయాలని చూస్తే ఊరుకోబోమని చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎంసీపీఐ(యూ) పొలిట్ బ్యూరో సభ్యులు వల్లెపు ఉపేందర్ రెడ్డి హెచ్చరించారు. ఈ సందర్భంగా వల్లెపు ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ 1984 సంవత్సరంలో అమరజీవి కామ్రేడ్ మద్ది కాయల ఓంకార్ స్థాపించిన ఎంసీపీ కాలక్రమంలో ఎంసీపీఐ తదనంతరం ఎంసీపీఐ(యూ) గా మార్పుచెంది ఎన్నికల నిబంధనావళి అనుసరించి రిజిస్ట్రేషన్ చేసుకొని అప్పటి నుంచి ఇప్పటివరకు వర్గ సామాజిక సమస్యలపై ఉద్యమిస్తుందన్నారు. చట్టసభలో పోటీ చేస్తూ పార్టీ కార్యక్రమాన్ని అమలు చేస్తూ అమర జీవులు కామ్రేడ్ ఓంకార్ భీమిరెడ్డి నరసింహారెడ్డి చూపిన బాటలో అమరవీరుల త్యాగాల పునాదులపై దేశవ్యాప్తంగా పురోగమిస్తున్నదని తెలిపారు. ఈ క్రమంలో పార్టీ వ్యతిరేక కార్యాకలాపాలకు, ఆర్థిక అరాచకత్వానికి పాల్పడినందున మోర్తాల చంద్రరావు, సింగతి సాంబయ్య, లింగంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మర్రెడ్డి వెంకటరెడ్డి, పానుగంటి నరసయ్య, మరికొంతమంది వివిధ సందర్భాల్లో పార్టీ నుంచి బహిష్కరించడం జరిగిందని పేర్కొన్నారు. అలాంటివారు ఈ మధ్యకాలంలో వరంగల్ పట్టణంలో పార్టీ పేరును, వ్యవస్థాపకులు కామ్రేడ్ ఓంకార్, కామ్రేడ్ బీఎన్ రెడ్డి పేర్లను వాడుకుంటూ వారి స్వార్థపూరిత ప్రయోజనాల కోసం చరిత్రను వక్రీకరిస్తున్నారన్నారు. ఇలాంటి చర్యలు చట్టరీత్యా వ్యతిరేకమని, ఇలాంటి పద్ధతులను తక్షణమే మానుకొని ఓంకార్, బీఎన్ రెడ్డిల పేర్లను వారు స్థాపించిన పార్టీని వాడటం ఉపసంహరించుకోవాలని, లేకుంటే తగిన పద్ధతులలో చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు గోనె కుమారస్వామి, హనుమకొండ జిల్లా ఎన్ రెడ్డి హంసారెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నీల రవీందర్, గడ్డం నాగార్జున, మాస్ సావిత్రి, కర్ర రాజిరెడ్డి చీపురు ఒదయ్య, జిల్లా కమిటీ సభ్యులు మొగిలి శ్రీనివాస రావు, మంద భద్రయ్య, బలుగురి రాజేశ్వరరావు, బలుగురి ప్రభాకర్ రావు, మహేశ్వరం రవీందర్, ఎండీ ఉస్మాన్, తదితరులు పాల్గొన్నారు.

## పత్తిపాకలో మహిళా దినోత్సవ వేడుకలు



**వరంగల్ వాయిస్, శాయంపేట :** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పత్తిపాకలో శుక్రవారం మహిళా దినోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమాన్ని టీఆర్టీయూ రాష్ట్ర కార్యవర్గం సభ్యులు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధవి, అనిత, విజయ కిరణ్మయి, అంజనిని ఘనంగా సత్కరించారు. నేటి విద్యా వ్యవస్థలో మహిళా ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ఉన్నతమైనదని, పిల్లలు విద్యా అభివృద్ధికి మహిళా ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని రాష్ట్ర సంఘ బాధ్యులు తిరుమలగిరి శ్రీనివాస్ కొనియాడారు. మహిళా ఉపాధ్యాయుల సౌకర్యాల గురించి మనం ఎంతో ఆలోచించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల బాధ్యుల కిరణ్మయి, జిల్లా బాధ్యులు రఘు, రాష్ట్ర బాధ్యులు అంజని, చాను పాషా, శ్రీనివాస్, బొలిశెట్టి కమలాకర్, విజయ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు పురుషులతో సమానంగా ఎదగాలి

### ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు



**వరంగల్ వాయిస్, పరకాల :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండల ప్రజా పరిషత్ పరకాల కార్యాలయంలో మండల పరిధిలో పని చేస్తున్న మహిళా ఉద్యోగులను ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో ఎదుగుతున్నారని, అయినప్పటికీ కుటుంబంలో ఎవరి పాత్ర వారు పోషించినప్పుడే సుఖ సంతోషాలతో ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఏఈ ఎన్.శ్రీలత, కార్యాలయ పర్యవేక్షకులు సీహెచ్ శైలశ్రీ, టెక్నికల్ అసిస్టెంట్ సుమలత, పంచాయతీ కార్యదర్శులు బి.సుమలత, మహ్మద్ రిజ్వానా, ఫీల్డ్ అసిస్టెంట్ గడ్డం కోమలను సన్మానించారు. ఈసీ రజనీకాంత్, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

## పద్మశాలి కుల వృత్తేతర పనులు చేస్తున్న వారిని ఆదుకోండి

### రామ రాజేష్ నేత



**వరంగల్ వాయిస్, వరంగల్ :** కులవృత్తితో పాటు ఇతర పనులు చేసుకుంటూ జీవిస్తున్న నిరుపేద పద్మశాలి కుటుంబాల సంక్షేమం కోసం కూడ ఆలోచన చేయాలని రామ రాజేష్ నేత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ సాధన ఉద్యమంలో పాల్గొని ఉపాధి కోల్పోయిన వారికి, వివిధ తెలంగాణ అసోసియేషన్ ల పద్మశాలి కులానికి చెందిన ఫౌండర్స్ కు గుర్తింపు ఇవ్వాలని కోరారు. గతంలో కుల వృత్తి చేసిన పద్మశాలీలు ప్రస్తుతం ఇతర పనులపై ఆధార పడి జీవిస్తున్న కూడా 50 సంవత్సరాల వయసు దాటిన వారికి పింఛన్ పథకం అమలు చేయాలన్నారు. ఉపాధి కోసం ఆర్థిక సహాయం, తెలంగాణ సాధన ఉద్యమంలో పాల్గొన్న వారికి ప్రభుత్వంచే తగిన గుర్తింపు ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఇల్లు లేని వారికి ఇండ్లు, ప్రభుత్వ స్థలం ప్రభుత్వం ఇవ్వాలని, సంక్షేమ పథకాల విషయంలో పద్మ శాలి కులస్థులకు ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ప్రభుత్వ సహకారం తో పద్మశాలి నిరుపేద కుటుంబాలను ఆదుకునేటట్లు ప్రభుత్వం, కుల సంఘాలు కార్యాచరణకు దిగాలని కుల వృత్తేతర పద్మశాలి కులస్తులు రామ రాజేష్ నేత , సారంగుల బాలసుబ్రమణ్యం నేత, మెతుకు ఉప్పలయ్య తదితరులు డిమాండ్ చేస్తున్నారు.

## జాతీయ జన ఔషధీ దినోత్సవం

**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** హనుమకొండ డీఎంహెచ్ఓ అప్పయ్య ఆదేశాల మేరకు జాతీయ జన ఔషధి దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం కమలాపూర్ మండలంలోని కానిపర్తి ఆయుష్మాన్ ఆరోగ్యం మందిరంలో నిర్వహించారు. గ్రామ ప్రజలకు ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం సేవలు, మందుల వితరణ గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అరుణ్ కుమార్, ఏఎన్ఎం లావణ్య, ఆశలు రజిత, కావ్య, రాణి, కోమల, సంధ్య, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## ప్రత్యేకాధికారిగా డాక్టర్ విజయభాస్కర్



**వరంగల్ వాయిస్, పరకాల :** మండల ప్రత్యేక అధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న డాక్టర్ కె వెంకటనారాయణ జాయింట్ డైరక్టర్ గా పదోన్నతిపై ఖమ్మం జిల్లాకు వెళ్లడంతో వారి స్థానంలో జిల్లా పశు వైద్యాధికారిగా భాధ్యతలు చేపట్టిన డాక్టర్ కె.విజయ భాస్కర్ పరకాల మండల ప్రత్యేక అధికారిగా శుక్రవారం విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకు రావాలని, సాధ్యమైనంత వరకు వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి పెద్ది ఆంజనేయులు, పర్యవేక్షకులు సీహెచ్ శైలశ్రీ, స్వాగతం పలుకుతూ శాలువాతో ఘనంగా సన్మానించారు.

## బాధిత కూలీల కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా ఇవ్వాలి

### ➲ తాటిపాముల వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** మండలంలోని జీడిగడ్డ తండాకు చెందిన గిరిజన వ్యవసాయ కూలీలు గురువారం మిరపకాయలు ఏరడానికి వేరే గ్రామానికి గూడ్స్ ట్రాలీలో వెళుతున్న సందర్భంగా ప్రమాదానికి గురై ఇద్దరు కూలీలు మరణించడం, పలువురు క్షతగాత్రులు కావడం అత్యంత బాధాకరమని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు ఆవేదన వ్యక్తం చేశారు. కూలీల మరణం పట్ల ప్రగాఢ సంతాపాన్ని వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు. రెక్కాడితే కానీ డొక్కాడని శ్రమజీవులైన వ్యవసాయ కూలీలు తమ ఊళ్లో పనులు లేక గత్యంతరం లేక ఇతర గ్రామాలకు కూలి పనుల కోసం వెళుతున్న సందర్భంగా ప్రతి సంవత్సరం ఇలాంటి ప్రమాదాలకు గురై ఎంతో మంది కూలీలు ప్రాణాలు కోల్పోతున్న ప్రభుత్వ అధికారులు తగిన నివారణ చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకుని భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటనలు జరగకుండా చూడాలన్నారు. మరణించిన కుటుంబాల వారికి రూ. 25 లక్షల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని, కాళ్లు రెక్కలు విరిగి క్షతగాత్రులై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి పూర్తిస్థాయిలో ఉచిత వైద్య సేవలు, ఒక లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందించి అన్ని విధాల ఆ కుటుంబాలను ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టాన్ని రానున్న పార్లమెంటు సమావేశాలలో ఆమోదించి అమలు పరచాలని వెంకట్రాములు డిమాండ్ చేశారు.

# పద్మశాలీలంతా వేలాదిగా తరలి వస్తాం..



- ధర్మసాగర్, హసన్‌పర్తి మండలాల్లో సన్నాహక సమావేశం
- మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

**వరంగల్ వాయిస్, ధర్మసాగర్ :** హసన్ పర్తి, ధర్మసాగర్ మండలాల నుంచి వేలాదిగా పద్మశాలి మహాసభకు తరలివస్తామని హామీ ఇచ్చారు. కుల ఐక్యత కోసం, భవిష్యత్తు రాజకీయాల కోసం నిర్వహిస్తున్న మహాసభకు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేస్తామని చెబుతున్నారు. రెండు మండలాల్లో తెలంగాణ ప్రాంత హనుమకొండ జిల్లా పక్షాన మహాసభ సన్నాహక సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు బచ్చు ఆనందం అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పద్మశాలి కులస్తులు పెద్ద ఎత్తున హాజరై పోస్టర్



ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేద్దామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యదర్శి వైద్యం రాజగోపాల్, ప్రధాన కార్యదర్శి కెదాసి వెంకటేశ్వర్లు, మీడియా కోఆర్డినేటర్ పులికంటి రాజేందర్, ఉపాధ్యక్షులు వెంగళ వేణుగోపాల్, జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి కందికట్ల ప్రశాంత్, కోశాధికారి సత్తూరి సంతోష్, విజయ్ కుమార్, హసన్ పర్తి పద్మశాలి సేవా సంఘం అధ్యక్షులు కేదాసి రాకేష్, పరపతి సంఘం అధ్యక్షులు చేరాల రవీందర్, గాడేపల్లి సతీష్, భరత్, సుభాష్, సారంగపాణి, యుగంధర్, భాస్కర్, కుమారస్వామి, సతీష్ పాల్గొన్నారు.

సంయుక్త కార్యదర్శిగా శ్రీరాముల విజయ్ కుమార్

వరంగల్ వాయిస్, ధర్మసాగర్ : హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలానికి చెందిన శ్రీరాముల విజయ్ కుమార్ ను జిల్లా సంయుక్త కార్యదర్శి నియమించినట్లు తెలంగాణ ప్రాంత హనుమకొండ జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు బచ్చు ఆనందం తెలిపారు. శుక్రవారం హనుమకొండ జిల్లా పద్మశాలి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో విజయ్ కుమార్ కు అధ్యక్షుడు ఆనందం పద్మశాలి కండువా కప్పి సంయుక్త కార్యదర్శిగా నియమించి శుభాకాంక్షలు తెలిపారు. పద్మశాలీల సమస్యల సాధనకు తన వంతు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వైద్యం రాజగోపాల్, జిల్లా మీడియా కోఆర్డినేటర్ పులికంటి రాజేందర్, ఉపాధ్యక్షులు వెంగళ వేణుగోపాల్, వెంగళ రమేష్, చక్రపాణి, పాల్గొన్నారు.

# బాధితురాలికి సత్వర న్యాయం చేయాలి

■ ఆశా వర్కర్స్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాసు మాధవి

**వరంగల్ వాయిస్, వరంగల్ :** జగిత్యాల జిల్లాలో దళిత ఆశా కార్యకర్త మీద ఫిబ్రవరి 27న శివరాత్రి పండుగ డ్యూటీ చేసి ఇంటికి తిరిగి వెళుతున్న సందర్భంలో జరిగిన అత్యాచారం, దాడిని సీఐటీయూ వరంగల్ జిల్లా కమిటిగా తీవ్రంగా ఖండిస్తూ సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామిలు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కాసు మాధవి మాట్లాడుతూ నిందితుడిని వెంటనే ఎస్సీ, ఎస్టీ చట్టంలోని సెక్షన్స్ ప్రకారం కఠినంగా శిక్షించాలని, బాధిత ఆశా వర్కర్ కు చట్ట ప్రకారం పరిహారం ఇవ్వాలని, ఆమె కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. జగిత్యాలలో జరిగిన ఈ సంఘటన అత్యంత బాధాకరమని సిగ్గుచేటనిఅన్నారు. ఈ నేరానికి పాల్పడిన నిందితిడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ అత్యాచార సంఘటనలు దేశంలో క్షీణిస్తున్న శాంతిభద్రతల పరిస్థితికి అద్దం పడుతుందన్నారు. వెంటనే




ప్రభుత్వం బాధితురాలికి మెరుగైన వైద్యం అందించి వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరించాలన్నారు. బాధితురాలి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, నిరుపేదరాలైన ఆమెకి ఇల్లు కట్టించిఇవ్వాలని, సమాజంలో గౌరవంగా జీవించడానికి కావలసిన అన్ని ఏర్పాట్లు ప్రభుత్వమే చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా నాయకురాళ్లు ముదిగొండ మాధవి, దయనం ప్రమీల, బి.పూలమ్మ, జె శోభ, డి గీత, బి సంధ్య, స్వర్ణలత, మంజుల తదితరులు పాల్గొన్నారు.

# రాగి భవిత శ్రీకి రాష్ట్ర స్థాయి అవార్డు



**వరంగల్ వాయిస్, ఖిలావరంగల్ :** వరంగల్ నగరంలోని 42వ డివిజన్ రంగశాయిపేటకు చెందిన అరవింద పబ్లిక్ స్కూల్ విద్యార్థిని రాగి భవిత శ్రీ (5వ తరగతి) పేయింటింగ్ (సీపీఓ) విభాగంలో అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి అవార్డు అందుకుంది. ఇండియన్ బ్రిలియంట్ ఒలంపియాడ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్ చిక్కడపల్లిలోని శ్రీ త్యాగరాయ గానసభలో నిర్వహించిన రాష్ట్రస్థాయి టాపర్ అవార్డుల ప్రధానోత్సవానికి ముఖ్య అతిథులుగా హాజరైన తెలంగాణ అర్బన్ ఇన్ ఫ్రా డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నరసింహారెడ్డి, సినీ నటులు అశోక్ కుమార్, జెన్ని, ఘర్షణ శ్రీనివాస్, ప్రముఖ సైకాలజిస్ట్ బీవీ సత్య నగేష్, ఐబీఓ డైరెక్టర్ అంతోటి రామకృష్ణల చేతుల మీదుగా ప్రశంసాపత్రం, మెమొంటోను అందజేశారు. గత నెల 9న ఖమ్మం పట్టణంలో జరిగిన స్టేట్ సెకండ్ లెవెల్ ఎగ్జామ్ కు పాఠశాల నుంచి 8మంది విద్యార్థినీ విద్యార్థులు హాజరు కాగా ఆర్.భవిత శ్రీ రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపికైంది. గత సంవత్సరం కూడా అరవింద పబ్లిక్ స్కూల్ విద్యార్థిని సుతారి సంకీర్తన (6వ తరగతి) గణిత శాస్త్రంలో రాష్ట్రస్థాయి అవార్డును అందుకుంది. ఈ కార్యక్రమంలో ఇండియన్ బ్రిలియంట్ ఒలంపియాడ్ తెలంగాణ ఇన్చార్జ్ కావ్య, ఆంధ్ర ప్రదేశ్ ఇంచార్జ్ అజిత్ బేగ్, గాయకులు మొగిలి వెంకటేశ్వర్లు, నాగసాయి, తల్లిదండ్రులు విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కోటగుళ్ల గణపేశ్వరుడికి పట్టు వస్త్రాల బహూకరణ



**వరంగల్ వాయిస్, గణపురం :** కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్లకు గణపురం మండల కేంద్రానికి చెందిన పింగిళి రమేష్ చందర్ రెడ్డి సూర్యమ్మ, దంపతుల కుమారుడు, కోడలు సాదన్ రెడ్డి-దీప్తి దంపతులు ఆలయానికి సంవత్సరానికి సరిపడా పట్టు వస్త్రాలను శుక్రవారం బహూకరించారు. గత నాలుగు సంవత్సరాలుగా స్వామివారికి అలంకరించే పట్టు వస్త్రాలను వారు బహుకరిస్తున్నారు. అందులో భాగంగా రూ.16 వేల విలువైన పట్టు వస్త్రాలను ఆలయానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి ఆశీర్వచనాలు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయానికి ప్రతి సంవత్సరం పట్టు వస్త్రాలను అందజేస్తున్న పింగిళి రమేష్ చందర్ రెడ్డి సూర్యమ్మ, సాదన్ రెడ్డి దీప్తి దంపతులకు కోటగుళ్ల పరిరక్షణ కమిటీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది.

# ఇద్దరు పోలీసుల సస్పెండ్

**వరంగల్ వాయిస్, తొర్రూరు :** మహబూబాబాద్ జిల్లా పెద్ద వంగర పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ రాజా రామ్, కానిస్టేబుల్ సుధాకర్ ను క్రమశిక్షణ చర్యల్లో భాగంగా సస్పెండ్ చేస్తూ చేసిన ఐజి చంద్రశేఖర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. పెద్ద వంగర పోలీస్ స్టేషన్ పైన విశ్రాంతి గదిలో ఇద్దరు బయట వ్యక్తులతో కలిసి మద్యం సేవించారని సిబ్బందిపై ఆరోపణతో ఫొటో సోషల్ మీడియాలో వైరల్ కాగా, ఈ ఘటనపై విచారణ జరిపి హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ పై జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ రిపోర్ట్ పంపగా ఇద్దరినీ సస్పెండ్ చేస్తూ మల్టీ జోన్ ఐజీ చంద్రశేఖర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

# అఖిల భారత పద్మశాలి మహాసభను జయప్రదం చేయండి



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** హైదరాబాద్ నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో ఈనెల9న జరిగే అఖిల భారత పద్మశాలి 17వ మహాసభకు పద్మశాలి ఇంటి నుంచి ప్రతి ఒక్కరూ భారీగా తరలివచ్చి మహాసభను విజయవంతం చేయాలని వరంగల్ అఖిల భారత పద్మశాలి పట్టణ గౌరవ అధ్యక్షుడు 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేందర్ కుమార్, పద్మశాలి కులస్తులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వరంగల్ అఖిల భారత పట్టణ ప్రధాన కార్యదర్శి గోరంట్ల రాజు, 20వ డివిజన్ అఖిల భారత సేవా సంఘం అధ్యక్షులు గంజి సాంబయ్య, 20వ డివిజన్ అఖిల భారత పద్మశాలి అధ్యక్షులు ములుక సురేష్, 19వ డివిజన్ అఖిల భారత పద్మశాలి అధ్యక్షులు క్యాతం రంజిత్, మార్త ఆంజనేయులు, కుసుమ సారంగపాణి, వేముల నాగరాజు, రంగు శ్రీధర్, వంగరి రాంప్రసాద్, దుస్స కృష్ణ, గూడూరు కృష్ణ, కుందారపు గోపి, బొప్పరాతి నగేష్, మార్త జగన్, క్యాతం రవీందర్, క్యాతం శ్రీనివాస్, పద్మశాలి కులస్తులు తదితరులు పాల్గొన్నారు.

# చిట్యాల రామచంద్రం మృతి

**వరంగల్ వాయిస్, పాలకుర్తి :** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరవనిత చాకలి ఐలమ్మ మనుమడు చిట్యాల రామచంద్రం గురువారం అర్ధరాత్రి పాలకుర్తిలో కన్నుమూశారు. పెత్తందారీ వ్యవస్థను ఎదిరించి పోరాడిన రామచంద్రం పాలకుర్తి సర్పంచిగా 20 ఏళ్లకు పైగా ప్రజలకు సేవలందించారు.



## సుదర్శన్ రావు గంగపుత్రకు సన్మానం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ విద్యా కమిషన్ వారు తెలంగాణ బీసీ విద్యార్థుల అభ్యున్నతికై వివిధ పాలసీలు తయారు చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడానికి ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి బీసీ విద్య కమిటీలో సభ్యుడిగా ఆచార్య సర్గు సుదర్శన్ రావు గంగపుత్రను నియమించిన సందర్భంగా తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి వరంగల్ గంగపుత్ర హౌసింగ్ డైరెక్టర్ టుంగుటూరి రాజేష్ ఖన్నా హైదరాబాద్ లో వారి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. అనంతరం టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర మాట్లాడుతూ నిరుపేద గంగపుత్ర కులంలో జన్మించిన ఆచార్య సర్గు సుదర్శన్ రావు గంగపుత్రను బీసీ విద్య కమిటీలో అవకాశం కల్పించిన తెలంగాణ బీసీ విద్యా కమిషన్ చైర్మన్ విశ్రాంత ఐఏఎస్ ఆకునూరి మురళికి తెలంగాణ బీసీ గంగపుత్రుల తరుపున ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజులలో ఆచార్య సుదర్శన్ రావు గంగపుత్ర మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. అలాగే, తెలంగాణ బీసీ విద్యా కమిటీ కన్వీనర్ గా నియమితులైన ఆచార్య మురళి మనోహర్ కుడా అభినందనలు తెలిపారు.

## వన్నాల విజయలక్ష్మి మృతి బాధాకరం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మాజీ శాసనసభ్యుడు వన్నాల శ్రీరాములు సతీమణి విజయలక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడం అత్యంత బాధాకరమని సీపీఐ రాష్ట్ర నాయకులు, బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు తాటిపాముల వెంకట్రాములు, ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భీమనాదం శ్రీనివాస్ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. శుక్రవారం హనుమకొండలో వన్నాల శ్రీరాములు నివాసానికి వెళ్లి విజయలక్ష్మి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి జోహార్లు అర్పించారు. దుఃఖ సాగరంలో ఉన్న శ్రీరాములును, వారి కుమారులు వెంకటరమణ, అరవింద్ కుమార్, రాకేష్ కన్నా, కుటుంబ సభ్యుల పరామర్శించి సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా వెంకట్రాములు మాట్లాడుతూ శ్రీరాములు రాజకీయంగా అంచెలంచలుగా ఎదిగి శాసన సభ్యుడిగా ఎన్నికై ప్రజా సేవలో నిమగ్నం కావడానికి, ప్రజా సమస్యలపై స్పందిస్తూ నిత్యం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కృషి చేస్తున్నారంటే అందుకు విజయలక్ష్మి అందించిన తోడ్పాటు ఎనలేనిదన్నారు. వారి మరణం తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు.

## 9న పద్మశాలి సభను విజయవంతం చేయాలి

### చింతకింది కృష్ణమూర్తి నేత



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** తరతరాలుగా కులవృత్తిని నమ్ముకొని జీవిస్తున్న పద్మశాలి చేనేత కార్మికులు తమ హక్కుల సాధన కోసం ఈ నెల 9న ఆదివారం జరిగే బహిరంగ సభకు పెద్ద ఎత్తున తరలి రావాలని తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి చింతకింది కృష్ణమూర్తి, రాష్ట్ర నేత కంచంపల్లి సొసైటీ చైర్మన్ రాపోలు రామ్మూర్తి పిలుపునిచ్చారు. శుక్రవారం రఘునాథపల్లి మండలం కొమ్మల గ్రామంలో జరిగిన పద్మశాలి సమావేశంలో మాజీ సర్పంచ్ వల్లాల అశోక్ అధ్యక్షత వహించగా వారు పాల్గొని మాట్లాడారు. పద్మశాలి చేనేత కార్మికులు ఆర్థికంగా రాజకీయంగా ఎదగాలని, రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో అవకాశం ఉన్నచోట పోటీ చేయాలన్నారు.

## జూనియర్ లెక్చరర్స్ అభ్యర్థుల పోరుబాట

- విజయవంతం చేయాలని నాగరాజ్ గౌడ్ పిలుపు



**వరంగల్ వాయిస్, కేయూ :** ఈనెల 11న ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద చేపట్టే జూనియర్ లెక్చరర్స్ అభ్యర్థుల పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కాకతీయ యూనివర్సిటీ ఇంచార్జి ఆరేగంటి నాగరాజ్ గౌడ్ పిలుపునిచ్చారు. ఈనెల 11న ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద చేపట్టే మహాధర్నా కార్యక్రమానికి బీసీ విద్యార్థి సంఘం నాయకులు మద్దతుగా నిలిచి కాకతీయ యూనివర్సిటీ మొదటి గేటు వద్ద శుక్రవారం పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది. తదనంతరం నాగరాజు గౌడ్ మాట్లాడుతూ జేఎల్ నోటిఫికేషన్ 2022లో ఇచ్చి 2023లో అభ్యర్థులకు పరీక్ష పెట్టి 2024లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేసి 2025లో కళాశాలను కేటాయించి కూడా ఇప్పటివరకు అపాయింట్ మెంట్ ఆర్డర్లను పోస్టింగ్ ఆర్డర్లను ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి జూనియర్ లెక్చరర్లకు పోస్టింగ్ ఆర్డర్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ఒక మార్పు ప్రారంభమవుతుందని నిరుద్యోగులు నమ్మి ఓట్లు వేసి అధికారంలో కూర్చోబెడితే ఇవాళ విద్యార్థులకు నిరుద్యోగులకు ఒరిగిందేమీ లేదన్నారు. వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించకపోతే మాత్రం ఈ నెల 11న ధర్నా చౌక్ వద్ద మహాధర్నా కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తామన్నారు. వెంటనే విద్యార్థులకు మంచి విద్య అందాలంటే కచ్చితంగా లెక్చరర్ల నియామకం చేపట్టి విద్యార్థులకు నాణ్యమైనటువంటి బోధనను కల్పించి వారు ఉన్నత శిఖరాలకు ఎదిగే విధంగా వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వెయ్యాలి కానీ రాష్ట్ర ప్రభుత్వం దానికి విరుద్ధంగా వారికి విద్యను దూరం చేయాలనే కుట్రలో భాగంగానే ఈ విధంగా వ్యవహరిస్తుందన్నారు. మీ ఒంటెద్దు పోకడను మార్చుకొని వెంటనే జూనియర్ లెక్చరులకు పోస్టింగ్ ఆర్డర్లను ఇచ్చి వారికి న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జేఎల్ అభ్యర్థులు సతీష్, పాషా, వంశీ ,వెంకటకృష్ణ, రమేష్, రాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి పల్లెలో బీసీ జెండా ఎగురవేస్తాం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** గ్రామ గ్రామాన సంస్థాగత నిర్మాణం చేసి బీసీల ఉద్యమ పోరాటాన్ని బలోపేతం చేస్తామని, ప్రతి పల్లెలో బీసీ జెండాను ఎగురవేస్తామని బీసీ ఆజాది ఫెడరేషన్ రాష్ట్ర కార్యనిర్వాక అధ్యక్షుడు కుడికాల భాస్కర్ అన్నారు. శుక్రవారం బీసీ ఆజాది మహిళా ఫెడరేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షురాలిగా ఆరేపల్లి గ్రామానికి చెందిన వెల్దండి స్వరూప, భట్టుపల్లి గ్రామానికి చెందిన హనుమకొండ జిల్లా బీసీ మహిళా ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శిగా బొంగు లక్ష్మిలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా బీసీ ఆజాది మహిళా ఫెడరేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు వెల్దండి స్వరూప మాట్లాడుతూ ఇంత మంచి అవకాశం కల్పించడం వ్యవస్థాపక అధ్యక్షులు జక్కని సంజయ్ కుమార్ కు, రాష్ట్ర కమిటీ సభ్యులందరికీ ధన్యవాదాలు తెలుపుతూ గ్రామ గ్రామాన బీసీలను సంఘటితం చేస్తూ సంస్థాగతంగా నిర్మాణం చేస్తామని, సంస్థాగత నిర్మాణంతో బీసీ ఉద్యమాన్ని బలోపేతం చేస్తామని తెలిపారు. జనాభాలో 52 శాతానికి పైగా ఉన్న బీసీలు విద్య, ఉద్యోగ, వ్యాపార, రాజకీయ రంగాల్లో వెనుకబడి ఉన్నారని, వారిని అభివృద్ధి చేయడమే దేశ అభివృద్ధి అవుతుందన్నారు. బీసీలకు విద్య, ఉద్యోగ వ్యాపార రాజకీయ రంగాల్లో జనాభా ప్రాతిపదికన వాటకోసం, చట్ట సభల్లో బీసీలకు రిజర్వేషన్ల కోసం, దేశ వ్యాప్త కుల గణన కోసం, బీసీ అట్రాసిటీ చట్టం కోసం నిరంతరం పోరాడుతామని, రాజీలేని ఉద్యమాలతో బీసీల హక్కుల సాధ్యమని, అదే తమ ధ్యేయమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ ఆజాది ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుసూదన్ రాజు, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జి జినుకాల లక్ష్మణ్ రావు , వరంగల్ జిల్లా అధ్యక్షులు గజవెల్లి మనోహర్ , నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## యూనివర్సిటీలపై మోడీ ప్రభుత్వ కుట్రలను ప్రతిఘటించండి

- 18న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి



**వరంగల్ వాయిస్, కేయూ :** దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన యూజీసీ నూతన ముసాయిదా దేశ సమైక్య స్ఫూర్తికి పూర్తి విరుద్ధమని, ఇది భారత రాజ్యాంగం ఉమ్మడి జాబితాలోని విద్యారంగం పట్ల వివిధ రాష్ట్రాలకు కల్పించిన హక్కులను కాలరాయడమేనని పీడీఎస్ యూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కాంపాటి పృథ్వీ, ప్రధాన కార్యదర్శి అనిల్ సాయిబోలా తెలిపారు. శుక్రవారం హనుమకొండ ప్రెస్ క్లబ్ లో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థుల ఐక్యత (పీడీఎస్ యూ), ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో ప్రెస్ మీట్ నిర్వహించి, కరపత్రాలు విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా పృథ్వీ,అనిల్ లు మాట్లాడుతూ పి.డి.యస్.యు తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో యూజీసీ నూతన ముసాయిదాను వ్యతిరేకిస్తూ మార్చి 18న కాకతీయ విశ్వ విద్యాలయంలో "యూనివర్సిటీ విద్యార్థుల రాష్ట్ర సదస్సు" నిర్వహిస్తున్నామని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం దేశంలోని విద్యావేత్తలను, మేధావును, ప్రజాస్వామిక వాదులను, వివిధ రాష్ట్ర ప్రభుత్వాలను సంప్రదించకుండా ఏకపక్షంగా విద్యారంగంలో దేశ వ్యతిరేక, రాజ్యాంగ వ్యతిరేక సంస్కరణలకు పూనుకుంటున్నది. ఆర్ఎస్ఎస్, సంఘ్ పరివార్ శక్తుల కనుసన్నల్లో విద్యా కాషాయీకరణే ధ్యేయంగా, దేశ లౌకిక వ్యవస్థ విచ్ఛిన్నమే లక్ష్యంగా దేశంలోని భిన్నత్వంలో ఏకత్వాన్ని దెబ్బతీసనే కుట్రపూరిత చర్యలకు ఒడిగడుతున్నది. నూతన జాతీయ విద్యా విధానం 2020, యూజీసీ నూతన ముసాయిదా –2025 తీసుకువచ్చి విద్యార్థుల్లో కుల, మత తత్వాలతో కూడిన మూఢత్వ భావాలను పెంపొందిస్తూ, ప్రశ్నించే తత్వాన్ని, ప్రజాస్వామిక, మానవీయ లక్షణాలను సమాధి చేయచూస్తుంది. యూజీసీ నూతన ముసాయిదా రాష్ట్ర యూనివర్సిటీల మనుగడను, స్వయం ప్రతిపత్తిని ప్రశ్నార్ధకంగా మార్చుతున్నది. విశ్వవిద్యాలయాల్లోని వైస్ ఛాన్సలర్ (వీసీ)ల నియామక ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వాలకు, సెర్చ్ కమిటీలకు సంబంధం లేకుండానే రాష్ట్ర గవర్నర్లకు అప్పగించటం, విద్యారంగం పట్ల ఏమాత్రం బోధన అనుభవం లేని వారిని, వివిధ రంగాల్లోని బడా కార్పొరేట్ పారిశ్రామిక వ్యాపారవేత్తలను వీసీలుగా నియమించుకునే వెసులుబాటును నూతన ముసాయిదాలో పొందుపరచడం తీవ్ర అభ్యంతరకరమన్నారు. ఇలాంటి సంస్కరణలు విశ్వవిద్యాలయాలను క్రమంగా స్వదేశీ,విదేశీ కార్పొరేట్ పెట్టుబడిదారులకు కుట్రపూరితంగా కట్టబెట్టే చర్యలని మండిపడ్డారు. కాబట్టి విశ్వవిద్యాలయాలను కుట్రపూరితంగా నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాల చర్యలను విద్యార్థి లోకం సంఘటితంగా ప్రతిఘటించి, విశ్వవిద్యాలయాల స్వయంప్రతి పత్తిని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. మార్చి 18న కేయూలో జరిగే "యూనివర్సిటీ విద్యార్థుల రాష్ట్ర సదస్సుకు" ముఖ్య వక్తలుగా కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్. కాత్యాయిని విద్మహే, కేయూ ప్రొఫెసర్ వై.వెంకయ్య లు పాల్గొని ప్రసంగిస్తారని, అలాగే దేశంలోని వివిధ యూనివర్సిటీల నుంచి పీడీఎస్ యూ ప్రతినిధులు హాజరై ప్రసంగిస్తారని తెలిపారు. ఈ సదస్సుకు విద్యార్థులు, విద్యావేత్తలు, మేధావులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్ యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నరసింహారావు, రాష్ట్ర నాయకులు పి.అనూష, కేయూ అధ్యక్షులు బి.బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి వి.కావ్య, జిల్లా నాయకులు గణేష్, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

# కనీస మద్దతు ధర హక్కు చట్టం చేయాలి




■ సంయుక్త కిసాన్ మోర్చా డిమాండ్

**వరంగల్ వాయిస్, వరంగల్ :** కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రైతు కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ శుక్రవారం వరంగల్ హెడ్ పోస్టాఫీస్ సెంటర్ లో సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతు సంఘాల నాయకులు ధర్నా నిర్వహించారు. మోడీ ప్రభుత్వం మూడు రైతు వ్యతిరేక నల్ల చట్టాలను తీసుకురాగా వాటికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా రైతాంగం పోరాటం చేయడంతో ఆ చట్టాలను ఉపసంహరించుకున్నామని చెప్పి దొడ్డి దారిన మరొక రూపంలో జాతీయ మార్కెట్ వ్యవసాయ ముసాయిదా బిల్లును పార్లమెంట్లో ప్రవేశపెట్టిందని ఇది దేశ రైతాంగానికి గొడ్డలి పెట్టు అని వారు అన్నారు. ఈ బిల్లులో కనీస మద్దతు ధర హక్కు చట్టం గానీ కొనుగోలు గ్యారెంటీ గాని లేదని ఇది బడా కార్పొరేట్లు అంబానీ, ఆదానీలకు అనుకూలంగా తీసుకు వచ్చిన బిల్లు అని వారు విమర్శించారు. దేశం మార్కెట్ వ్యవస్థను బడా కార్పొరేట్లకు అనుకూలంగా మార్చడమే గాక రాష్ట్రాల హక్కులను కాలరాశి వేస్తుందని, చిన్న సన్నకారు రైతులను దెబ్బతీస్తుందని రైతులు సరైన ఉత్పత్తి ధరలు ఉండలేరని వారన్నారు. బడ్జెట్లో వ్యవసాయ రంగానికి ఈ సంవత్సరం కూడా తక్కువ నిధులు కేటాయించిందని, ఉపాధి హామీ పథకానికి నిధులు తక్కువ చేయడమే గాక తగ్గించడమే కాక పని దినాలు కూడా తగ్గించిందని వారు ఆరోపించారు. ఎఫ్ సీఐ, సీసీఐ నాఫెడ్ ఇలాంటి సంస్థలను కూడా ఎత్తివేయడానికి కుట్రలు చేస్తున్నదని వారు అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ లో రైతాంగ ప్రజా అనుకూల విధానాలు ప్రవేశపెట్టాలని, లేదంటే రాబోవు రోజుల్లో మరొక పెద్ద రైతాంగ ఉద్యమ కార్యచరణ ఉంటుందని కేంద్ర ప్రభుత్వాన్ని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు రాచర్ల బాలరాజు, సోమిడి శ్రీనివాస్, గోనె కుమారస్వామి, ఈసంపల్లి బాబు, చిర్ర సూరి, ఇంద్రసేన, కోరబోయిన కుమార్ స్వామి, ఓదెల రాజయ్య, హంసల్ రెడ్డి, సీహెచ్ నరసింహారెడ్డి, సుధమల్ల భాస్కర్, అయిత నగేష్, మైదంపాణి తదితరులు పాల్గొన్నారు.

# సభ్యత్వ నమోదుకు ఐదు రోజుల గడువు

➲ ప్రెస్ క్లబ్ ఎన్నికలకు శ్రీకారం

➲ అడ్ హక్ కమిటీ ఏర్పాటు

**వరంగల్ వాయిస్, పరకాల :** పరకాల ప్రెస్ క్లబ్ ఎన్నికలకు శ్రీకారం చుట్టారు. అయితే నిబంధనల మేరకు సభ్యుల జాబితాను ఫైనల్ చేసిన తర్వాత ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు అడ్ హక్ కమిటీని నియమించారు. ఈ కమిటీ ఆధ్వర్యంలోనే సభ్యత్వ నమోదు, పరిశీలన, ఎన్నికలు కూడా పూర్తి చేసుకునేలా కార్యాచరణను రూపొందించారు. పరకాల ప్రెస్ క్లబ్ ఎన్నికలు నిర్వహించి అనేక సంవత్సరాలు కావస్తున్నందున పాత విధానాలను పరిగణలోనికి తీసుకోకుండా నూతనంగా సభ్యత్వాలు నమోదు చేసి దాని ఆదారంగా ఎన్నికలు నిర్వహించేందుకు అడ్ హక్ కమిటీ నిర్ణయించింది. పరకాల ప్రెస్ క్లబ్ లో సభ్యులుగా చేరేందుకు కొన్ని నిబంధనలు విదించారు. పరకాల మండలం, డివిజన్ కేంద్రంగా గత మూడు సంవత్సరాలుగా పనిచేస్తున్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు సభ్యులుగా చేరేందుకు అవకాశం కల్పించారు. అయితే వారు పనిచేసినట్లు ఆదారాలు చూపించాల్సి ఉంటుంది. అక్రిడేషన్ కార్డు లేదా సంస్థ నుంచి, జిల్లా ఇంచార్జి నుంచి పొందిన గుర్తింపు కార్డు, అర్హత పత్రాలు చూపించాలి. దీనితోపాటు జిరాక్స్ లు, ఒక పాస్ పోర్ట్ సైజ్ ఫోటో, రూ.200 సభ్యత్వ రుసుము చెల్లించి సభ్యత్వము పొందాలన్నారు. సభ్యత్వాల స్వీకరణను శనివారం ఉదయం 10 గంటలకు అందరి సమక్షంలో ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. సభ్యత్వ నమోదు ప్రక్రియ ఐదు రోజులపాటు కొనసాగుతుంది. ఈనెల 12వ తేదీ సాయంత్రం 6 గంటలకు ముగుస్తుంది. తర్వాత వచ్చిన సభ్యత్వ దరఖాస్తులను స్వీకరించరు. అదే విధంగా వరంగల్ ప్రెస్ క్లబ్ లేదా మరే ఇతర ప్రెస్ క్లబ్ లో సభ్యత్వం పొంది లేదా ఓటు వేసిన వారికి పరకాల ప్రెస్ క్లబ్ లో సభ్యత్వం ఇవ్వరు. ఈ నెల 13న అడ్ హక్ కమిటీ సమావేశమై సభ్యతం, ఓటర్ లిస్ట్ ను పరిశీలించి తుది ఓటర్ జాబితాను ప్రకటించనున్నారు. అనంతరం ఎన్నికల షెడ్యూల్ ప్రకటించనుంది. సభ్యులు అడ్ హక్ కమిటీకి సహకరించి ఎన్నికలు సజావుగా జరిగేలా కృషి చేయాలని కోరారు.

# సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

➲ బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే

➲ యూబీఐ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం అని బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ) వారి ఆధ్వర్యంలో హనుమకొండలోని పాపడమ్స్ కన్వెన్షన్ హాల్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కమిషనర్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో అతివల పాత్ర కీలకమని సామాజిక ఆర్థిక రాజకీయలో మహిళల భాగస్వామ్యం పెరగాలన్నారు. జీడబ్ల్యూఎంసీ శానిటేషన్ విభాగంలో సగం వరకు పారిశుధ్య సిబ్బంది మహిళలే అన్నారు. కష్టపడి పనిచేస్తూ నగరాన్ని శుభ్రం చేయడంలో వారు ముఖ్య భూమిక పోషిస్తున్నారన్నారు. బల్దియా తరపున మెప్మా కు చెందిన విభాగంలో సుమారు 1.15 లక్షల మంది మహిళలు ఎస్ హెచ్ జీ బృందాల్లో సభ్యులుగా ఉన్నారన్నారు. వారికి ఆర్థిక పరిపుష్టి అందించడానికి ప్రభుత్వం ఇందిర మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా లోన్ లను అందించి ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు. బ్యాంకర్ లు ప్రస్తుతం లోన్ ల పరిమితి పెంచి అందజేయాలని కోరారు. ఇంతే కాకుండా నగరానికి సంబంధించి మంత్రి ఎంపీతో పాటు వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు కమిషనర్ గా తాను వివిధ విభాగాల్లో ఉన్నతాధికారులుగా మహిళలు వారి సేవలు అందిస్తున్నారన్నారు. బల్దియా అడ్మినిస్ట్రేటివ్ విభాగంలో కూడా అనేక మంది మహిళలు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. పెన్షన్ లకు సంబంధించి ఒంటరి మహిళా, వితంతు, వృద్ధాప్య పెన్షన్ ల అందజేతలో సమస్యలు లేకుండా చూడాలని బ్యాంకర్ లకు కమిషనర్ తెలిపారు. అనంతరం జాతీయ ఆర్చరీ క్రీడాకారిణి మన్సూర అసీబాను కమిషనర్, బ్యాంకు ప్రతినిధులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ పలుగుల సత్యం, ఏజీఎంలు మహేష్, శ్రీరామ్ ఆగ్రో ఇంచార్జి జీవన్ కుమార్, ఎల్ డీఎం.రాజు తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మధ్యాహ్న భోజనం వర్కర్స్ కార్మికులకు పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పూసల రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం బాలసముద్రంలో ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 50 వేలకు పైగా మధ్యాహ్నం భోజనం కార్మికులు పనిచేస్తున్నారని, విద్యార్థులకు మంచి భోజనం అందించేలా సదుద్దేశ్యంతో ఈ పథకాన్ని ప్రారంభించినప్పటికి కార్మికులకు మాత్రం బిల్లుల చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో నేడు వంట చేసే కార్మికులందరూ రోడ్డున పడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టినట్లు రూ.10 వేల జీతం అమలు చేయలేకపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేనిఫెస్టో ప్రచారం రూ.10 వేలు ఇవ్వాలని, ప్రతి ఒక్కరికి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని, కులాల వారీ కాకుండా పూర్తి మొత్తంలో పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని రాబోయే రోజులలో పైలెట్ ప్రాజెక్టు కాకుండా వంట కార్మికులకే జీతాలు ఇచ్చి వారికి పని భద్రత కల్పించాలని, ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మిడ్ డే మిల్స్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణ్, హనుమకొండ జిల్లా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి జక్కు రాజు గౌడ్, గడ్డం లలిత, ధర్మల రామ్మూర్తి, కర్రె లక్ష్మణ్, జనగాని లక్ష్మి, కవిత తదితరులు పాల్గొన్నారు.

## మహాసభ పోస్టర్ ఆవిష్కరణ




**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** జిల్లా పద్మశాలి సంఘం భవనంలో పోచమ్మ మైదాన్ అఖిల భారత పద్మశాలి సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు లయన్ డాక్టర్ ఆడెపు రవీందర్ నేత ఆధ్వర్యంలో అఖిల భారత పద్మశాలి మహాసభ పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆడెపు రవీందర్ మాట్లాడుతూ అఖిల భారత పద్మశాలి సంఘం 17వ మహాసభ, తెలంగాణ ప్రాంత 8వ మహాసభ హైదరాబాదులోని ఎగ్జిబిషన్ గ్రౌండ్ నాంపల్లిలో ఈనెల 9న జరగనుందని, ఈ సభకు వరంగల్ జిల్లా పద్మశాలి సంఘం నాయకులు, డివిజన్ అధ్యక్షులు, అనుబంధ సంఘాలు చేనేత ప్రతినిధులు, సొసైటీ అధ్యక్షులు, కార్మికులు, కుల బాంధవులు అధిక సంఖ్యలో పాల్గొని హైదరాబాదులో జరుగుతున్న పద్మశాలి మహాసభను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు లయన్ డాక్టర్ ఆడెపు రవీందర్ కోరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ వడ్నాల నరేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి గోరంటల రాజు, ఉపాధ్యక్షులు మాచబత్తుల కుమారస్వామి, గంజి సాంబయ్య, వేముల నాగరాజు, డివిజన్ అధ్యక్షులు ములుక సురేష్, క్యాతం రంజిత్, వంగరి రాంప్రసాద్, మంత్రి కమలాకర్, దొంతుల రాజేష్, పాల్గొన్నారు.

## బంజార భాషను రాజ్యాంగంలో చేర్చాలి

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** బంజార, లంబాడి, సుగాలి మాతృ భాష అయిన 'గోర్ బోలి'ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించి రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్ లో చేర్చాలని తెలంగాణ బంజారా సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు ప్రొఫెసర్ జి.వీరన్న నాయక్, అధ్యక్షుడు జి.సజ్జన్ నాయక్, ప్రధాన కార్యదర్శి ఎల్.దాస్యా నాయక్ కోరారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో నివసిస్తున్న బంజార, లంబాడి, సుగాలి వారు 31 రకాల ఉప జాతులుగా పిలువబడుతున్నా వారి వేషధారణ, సంస్కృతి, సంప్రదాయాలు ఒకే విధాంగా ఉంటూ 'గోర్ బోలి' భాషను తమ మాతృ భాషగా చేసుకొని జీవనం సాగిస్తున్నారని వెల్లడించారు. వీరి భాష గోర్ బోలి అయినప్పటికీ లిపి లేని కారణంగా వివిధ రచనలను ఆయా రాష్ట్ర భాషల్లోనే కొనసాగిస్తున్నారన్నారు. వీరంతా ఒకే భాష, సంప్రదాయాలను కొనసాగిస్తున్నప్పటికీ ఆయా రాష్ట్రాలలో ఉన్న రిజర్వేషన్లను

# బాలికలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి



● హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బాలికలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. శుక్రవారం వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాల ఆవరణలోని హనుమకొండ జిల్లా ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ ప్రావీణ్య, కేఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ రాంకుమార్ రెడ్డి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ సునీతలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి కలెక్టర్ ప్రావీణ్య, డాక్టర్ రాంకుమార్ రెడ్డి, సునీత పూలమాల వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ బాలికలు ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలన్నారు. ఉన్నత సేవలు అందించే వృత్తులలో నర్సింగ్ ఒకటని, క్లిష్ట పరిస్థితుల్లోనూ సేవలందించడంలో నర్సుల సేవలు వెలకట్టలేనివన్నారు. మహిళా దినోత్సవం నేపథ్యంలో కళాశాల విద్యార్థినులు అద్భుతంగా నృత్యాలు చేశారని, మహిళా దినోత్సవ ఏర్పాట్లు చాలా బాగున్నాయని అన్నారు. కేఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ రాంకుమార్ రెడ్డి మాట్లాడుతూ మహిళలు



శక్తిమంతులు, ధైర్యవంతులు అని కొనియాడారు. మహిళలు ఎంతోమంది ప్రపంచ వ్యాప్తంగా భిన్న రంగాల్లో రాణిస్తున్నారన్నారు. పురుషులతో సమానంగా మహిళలు వివిధ రంగాల్లో తమ ప్రతిభను చాటుతున్నారని పేర్కొన్నారు. స్త్రీ, పురుషులు ఇద్దరూ సమానమేనని అన్నారు. నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ సునీత మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మహిళలు వివిధ రంగాల్లో రాణిస్తూ ప్రథమ స్థానంలో నిలుస్తున్నారన్నారు. మహిళా దినోత్సవ నేపథ్యంలో కళాశాల విద్యార్థినులు స్పందిస్తూ తాము జీవితంలో లక్ష్యం చేరేందుకు తల్లి ప్రోత్సాహంతో ముందుకు సాగుతామన్నారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ ప్రావీణ్యను శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

### ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై కలెక్టర్ సమీక్ష..

ఎల్ఆర్ఎస్ కోసం వచ్చిన దరఖాస్తులను నిర్ణీత సమయంలో పూర్తయ్యేలా సంబంధిత శాఖల అధికారులు చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రక్రియపై గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి లతో కలిసి మున్సిపల్, కుడా, జిల్లా పంచాయతీ, తదితర శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. దరఖాస్తుల పరిశీలనలో ఎదురవుతున్న ఇబ్బందులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో మిషన్ భగీరథ ఈఈ మల్లేశం, కుడా పీఓ అజిత్ రెడ్డి, సీపీఓ రవీందర్ రడేకర్, డీఎల్పీఓ గంగ భవాని, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఉద్యోగాలిప్పిస్తానంటూ మోసం

➲ లక్షల్లో డబ్బు, బంగారం స్వాహా
➲ అరెస్ట్ చేసిన పోలీసులు




**వరంగల్ వాయిస్, క్రైం :** ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ, అలాగే నిట్ కళాశాలలో సీటు ఇప్పిస్తానంటూ బాధితుల నుంచి లక్షల్లో నగదుతోపాటు బంగారు అభరణాలను స్వాహా చేసిన మోసగాడిని హనుమకొండ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. నిందితుడి నుంచి సుమారు రూ.5.10 లక్షల విలువ కలిగిన బంగారు అభరణాలతో పాటు రూ.2.68 లక్షల నగదు, మూడు సెల్‌ఫోన్లు, ఐడీఎఫ్ సీ డెబిట్ కార్డును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టుకు సంబంధించి హనుమకొండ ఏసీపీ దేవేందర్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడప జిల్లా వీరపునాయునిపల్లి మండలం ఇందుకూరు కొత్తపల్లి గ్రామానికి చెందిన కొమ్మ వివేకానంద రెడ్డి అలియాస్ కిషోర్ రెడ్డి కొద్ది కాలం ప్రైవేట్ ఉపాధ్యాయుడిగా పనిచేశారు. వచ్చిన జీతం డబ్బులు తన జల్సాలకు ఖర్చు కావడంతో తోటి ఉపాధ్యాయులనుంచి ఖర్చుల కోసం నగదు, బంగారు ఆభరణాలను తీసుకొని తిరిగి ఇవ్వకపోవడంతో ఆయనపై ఏపీలో మూడు కేసులు నమోదయ్యాయి. రెండు నెలలు జైలు జీవితం గడిపిన అనంతరం వివేకానంద రెడ్డి తన మకాంను హనుమకొండకు మార్చుకున్నాడు. ఇక్కడ కొత్త పేరుతో ఓ ప్రైవెయిట్ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తూనే మంచివాడిగా గుర్తింపు తెచ్చుకున్నాడు. తనకు వరంగల్ నిట్ లో పరిచయస్తులు ఉన్నారని ల్యాబ్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తానంటూ తోటి మహిళా ఉపాధ్యాయురాలిని నమ్మించి ఆమెవద్ద రూ.8 లక్షలు, అదే విధంగా ఆమె కొడుకునకు నిట్ లో సీటు ఇప్పిస్తానంటూ 60గ్రాముల బంగారు అభరణాలు తీసుకుని అక్కడి నుంచి మకాం మార్చాడు. ఇదే రీతిలో నిందితుడు పేరు మార్చుకొని మరో ముగ్గురికి ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ మోసానికి పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితుడు తాను నివాసం ఉంటున్న కిరాయి ఇంటినుంచి సామాను తరలిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని అంగీకరించాడని వెల్లడించారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన హనుమకొండ పోలీస్, టాస్క్ ఫోర్స్ సిబ్బందిని ఏసీపీ అభినందించారు. అదే విధంగా ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు కొత్తగా చేరే ఉపాధ్యాయుల పూర్తి వివరాలు సేకరించాలని, వారు ఎక్కడ పని చేసి వచ్చారో, వారిపై ఏమైనా కేసులు ఉన్నాయో విచారించిన తర్వాతనే జాయిన్ చేసుకోవాలని ఏసీపీ విజ్ఞప్తి చేశారు.

# కేఎంసీకి రెండు పార్థివ దేహాలు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** హనుమకొండ ప్రశాంత్ నగర్ సహృదయ వృద్ధాశ్రమంలో నివాసముంటున్న సంజీవ్ కుమార్(80) శుక్రవారం మృతి చెందగా యాకోబ్బి, చోటే మియా సహకారంతో సమాజ హితం కోరి, వైద్య విద్య నిమిత్తం, మెడికల్ కాలేజీకి శరీర దానం చేసేందుకు అంగీకరించారు. దీంతో తెలంగాణ నేత్ర, అవయవ, శరీర దాతల అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక అంబులెన్స్ లో పార్థీవ దేహాన్ని కేఎంసీ అనాటమీ విభాగానికి అప్పగించారు. అదే విధంగా కరీమాబాద్ నివాసి తొడుపునూరి అనసూయ (95) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఆమె పది సంవత్సరాల క్రితమే శరీర దానం హామీ పత్రం ఇచ్చారు. దీంతో ఆమె కోరిక మేరకు కుమారుడు యోగేంద్రనాథ్, మనవడు ప్రభాత్ కుటుంబ సభ్యుల సమ్మతితో పార్థీవ దేహాన్ని కేఎంసీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ పార్థీవ దేహాన్ని కేఎంసీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ రామ్ కుమార్ రెడ్డి, డాక్టర్ ఎన్.సంధ్య, అనాటమీ ప్రొఫెసర్ డాక్టర్ పద్మావతి, డాక్టర్ ప్రసూన, అనాటమీ సిబ్బంది ప్రేమ్ కుమార్, యాదగిరి, ప్రవీణ్, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఉపేందర్ రెడ్డి, వరంగల్ జిల్లా అధ్యక్షులు కె.మల్లారెడ్డి, హనుమకొండ జిల్లా అధ్యక్షులు పి.వేణు, ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్, అసోసియేట్ అధ్యక్షులు సాయి రెడ్డి, సంయుక్త కార్యదర్శి నరసింహ రాములు తదితరులు పాల్గొన్నారు. అవయవ, శరీర దానం చేసే వారు ఇతర వివరాలకు వరంగల్ అసోసియేషన్ అధ్యక్షులు కె.మల్లారెడి, 8790548706, హనుమకొండ అసోసియేషన్ అధ్యక్షులు పి.వేణు 9490133650 సెల్ నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

# మహిళలకు వందనం

### జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ వాయిస్, వరంగల్ :** జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం టీఎన్జీవో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్త్రీ, పురుషులు ఇద్దరు బండి చక్రాల్లాంటి వారన్నారు. మహిళలు సెన్సిటివ్ కాదని రాణి రుద్రమలా ఇంట్లో, కార్యాలయ విధి నిర్వహణలో నిబంధ్ధతగా ఉంటారని అన్నారు. వరంగల్ టీఎన్జీఓస్ అధ్యక్షులు గజ్జెల రామ్ కిషన్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆనావయిగా వరంగల్ జిల్లా టీఎన్జీఓస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళా దినోత్సవ వేడుకలకు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేసినందుకు మహిళా ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గాదె వేణుగోపాల్, జిల్లా కోశాధికారి పాలకుర్తి సదానందం, అసోసియేట్ అధ్యక్షులు హేమ నాయక్, సిటీ అధ్యక్షులు శంకషి రాజేష్, జిల్లా మహిళా నాయకులు రమాదేవి, తిరుమల, రజిత, సునీత నాయర్, ప్రియాంక, మేఘన, అన్నపూర్ణ, మానస, శ్వేత, కృష్ణవేణి, కవిత, జిల్లా ఉపాధ్యక్షులు రాజు, వెలిశాల రాజు, దుర్గారావు, నీలిమ, భవాని, భాగ్య, జీనత్, ఉష, మంజుల, కవిత తది తర నాయకులు పాల్గొన్నారు.

# క్రైమ్ డీసీపీగా జనార్ధన్



**వరంగల్ వాయిస్, క్రైం :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ నూతన క్రైమ్ డీసీపీగా బి.జనార్దన్ ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ట్రాన్స్ కో విభాగంలో అదనపు ఎస్పీగా పనిచేస్తున్న జనార్దన్ ను రాష్ట్ర ప్రభుత్వం ఎస్పీగా పదోన్నతి కల్పిస్తూ వరంగల్ క్రైమ్ డీసీపీగా నియమించింది. జనార్దన్ గతంలో ఎస్సై, సర్కిల్ ఇన్ స్పెక్టర్, ఏసీపీగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ లో పనిచేశారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE. EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com